క్లుప్తంగా

నేడు అయ్యప్ప దేవాలయంలో పూజలు

భూత్పూర్: మూసాపేట మండల కేంద్రంలోని అయ్యప్పగుట్టలో వెలిసిన సంకల్ప సిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రంలో ఆదివారం అయ్యప్ప విష్ పూజ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు తిరుపతయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి జంగం మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు అయ్యప్ప గణపతి, కుమారస్వామి, షిర్డీ సాయి విగ్రహాలకు పంచామృత అభిషేకాలు, అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పట్టణ కాంగ్రెస్ ఎస్సీ సెల్‌లో పలువురికి పదవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏర్పుల నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఎస్సీ సెల్‌లో పలువురికి పదవుల్లో నియామకం చేశారు. పట్టణ కాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా చక్రధర్, రాకేష్, కార్యదర్శిగా మహేష్‌లను నియమించారు. వీరికి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఏ. సంపత్‌కుమార్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రాలు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి పనిచేయాలని కోరారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, సాయిబాబా, నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం

బాలానగర్: మండల పరిధిలోని ఉడిత్యాలలో కొనసాగుతున్న శ్రీరామసీతా సమేత లక్ష్మణ, ఆంజనేయ, కుమార స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎంపీ, మాజీ మంత్రితో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామివారి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడారు. ఎండలు తీవ్రమయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డిని మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

15 నుంచి శంకరమఠంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొత్త బస్టాండ్ సమీపంలోని శంకర మఠంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ధర్మాధికారి గంగాపురం శ్రీహరినాథ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. చివరి రోజు ఉదయం పది గంటలకు సీతారామ కల్యాణోత్సవం, సాయంత్రం ఐదు గంటలకు రథోత్సవం, శోభాయాత్ర ఉంటుందని తెలియజేశారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ



బాలానగర్: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వాహనాన్ని శనివారం హైవేపై టోల్‌ప్లాజా సమీపంలో పోలీసు తనిఖీ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనం ఆపటంతో పూర్తిగా పరిశీలించుకోవాలని ఎమ్మెల్యే వారికి సహకరించినట్లు పోలీసు బృందం తెలియజేశారు.

రూ.50 వేల నగదు స్వాధీనం

హైవేపై బాలానగర్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కర్నూల్ జిల్లాకు చెందిన శివశంకర్ రూ.50 వేల నగదుతో ప్రయాణం చేస్తున్నాడు. అందుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి ఆధార పత్రాలు లేకపోవటంతో నగదు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్ యూటీఎఫ్ 11వ ఆవిర్భావోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవి కుమార్ మాట్లాడారు. యూటీఎఫ్ సంఘం ఏర్పడిన నాటి నుంచి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల, బదిలీలు, పదోన్నతులపై స్పందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కలమంద రామదాసు, కిష్టయ్య, సృజన, ఉమాదేవి, భాస్కర్, మన్యం పాల్గొన్నారు.

నేడు భూత్పూర్‌కు ఎమ్మెల్యే హరీశ్‌రావు రాక

భూత్పూర్: భూత్పూర్‌లో నిర్వహించే ఎంపీ ఎన్నికల ప్రచారానికి ఆర్థిక శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం హాజరుకానున్నట్లు మండల ప్రధాన కార్యదర్శి తూము శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరుకానున్నట్లు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

అమ్మ ఆదర్శ కమిటీలకే ప్రాధాన్యం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించి చేపట్టే పనుల్లో అమ్మ ఆదర్శ కమిటీలకే ప్రాధాన్యం కల్పిస్తామని స్థానిక మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలోని 57 పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు, అమ్మ కమిటీల అధ్యక్షులు, ఆర్‌పీలకు ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభమయ్యేలోగా గుర్తించిన పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఒకవేళ స్థానికంగా ఎవరూ ముందుకు రాకపోతే ఇంజినీరింగ్ విభాగం అధికారులు సూచించిన కాంట్రాక్టర్లతో చేయించవచ్చన్నారు. అందరూ ఈ పథకం మార్గదర్శకాలను తూచ. తప్పక పాటించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ పి.జయశ్రీ, ఎంఈ యు.బస్వరాజ్, డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈలు వైష్ణవి, సాయిరాం, టీఎంసీ కరుణాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అమ్మ కమిటీ అధ్యక్షులు, హెచ్ఎంలు, ఆర్‌పీలు

కమిటీలకు అవగాహన సమావేశం..



మిడ్జిల్‌లో మాట్లాడుతున్న డీఈఓ రవీందర్

మిడ్జిల్: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రవీందర్ మాట్లాడారు. ఇప్పటి నుంచి పాఠశాలల నిర్వహణ అమ్మ ఆదర్శ కమిటీలదే బాధ్యత అని, మహిళా సంఘాల వారు పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలను మెరుగుపర్చాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, ఎంపీడీఓ గీతాంజలి, ఎంఈఓ అనురాధ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యవసర పనులు పూర్తిచేయించండి



మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రాజు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర పనులు గుర్తించి వాటిని పూర్తిచేయించేందుకు పారదర్శకతతో వ్యవహరించాలని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రాజు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, మెంబర్ కన్వీనర్ల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. మరికొద్ది రోజుల్లో సెలవులు రానున్నందున ఇపుడే విద్యార్థుల కొలతలు తీసుకుని సమాఖ్య ద్వారా యూనిఫాంలు కుట్టించాలన్నారు. పనుల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సమీక్ష సందర్భంగా కమిటీ చైర్మన్, మెంబర్ కన్వీనర్ల సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

పాత జీవోల ప్రకారం చైర్మన్ల నియామకం తగదు..

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఎన్నికల్లో కొత్త గ్రామపంచాయతీలకు అన్యాయం జరిగిందని జిల్లా గిరిజన ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు థారాసింగ్ జెడ్పీ సీఈఓకు విన్నవించారు. స్పందించిన జెడ్పీ సీఈఓ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున కొత్త పంచాయతీల్లో సమాఖ్య కమిటీల నియామకం చేయటం లేదని, కోడ్ ముగిశాక తగిన నిర్ణయం తీసుకుంటామని బదులిచ్చారు.

నిర్వహణ లోపం...

- నామమాత్రంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, ప్రధానోపాధ్యాయుల సమావేశం

గండేడ్/మహమ్మదాబాద్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల సమావేశం నామమాత్రంగా కొనసాగింది. నిర్వహణ లోపం కారణంగా తూతూమంత్రంగా నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు కలిపి గండేడ్ ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శనివారం చేపట్టిన కార్యక్రమంలో రెండు మండలాలకు చెందిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మర్లు, ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. అందరూ కలిసి దాదాపు 150 మంది కంటే ఎక్కువే ఉన్నారు. అయితే సమావేశం హాలులో దాదాపు 80 మందికంటే ఎక్కవ కూర్చోవడం సాధ్యం కాదు. స్థలం సరిపోకపోవడంతో మీటింగ్ హాలు బయట వరండాల్లో కొన్ని కుర్చీలు వేశారు. మరికొంత మందికి కుర్చీలు సరిపోలేదు. అయితే మీటింగ్ హాలులో కూర్చున్న వారికి మాత్రమే అధికారులు చెప్పింది వినిపించడం తప్పా.. బయట కూర్చున్న వారికి ఏమి అర్థం కాలేదు.

సదుపాయాల కల్పనకు కృషి చేయాలి...

గ్రామాల్లోని పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని గండేడ్, మహమ్మదాబాద్ ప్రత్యేకాధికారులు పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. తాగునీరు, కరెంటు సౌకర్యాలు కలిపించాలన్నారు. మరుగుదొడ్లు, టాయిలెట్లు, ఫ్లోరింగ్ పనులు తదితరవి వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఎంపీడీఓ దేవన్న, ఎంఈఓ వెంకటయ్య పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి



అడ్డాకులలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

భూత్పూర్: రాబోయే వేసవి సెలవుల్లో మండలంలోని అన్ని పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం అడ్డాకుల మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడారు. వేసవిలో పాఠశాలలకు సెలవు ఉన్నందున మండలంలోని అన్ని పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు తాగునీరు, మరుగుదొడ్లతో పాట మౌలిక సదుపాయాలన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.

అమ్మ ఆదర్శ కమిటీల ఎంపిక

నవాబుపేట: మండలంలో పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ కమిటీలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని గ్రామాల కమిటీలు పూర్తి చేసినట్లు వివరించారు. మండలంలో 69 పాఠశాలలకు ఆయా గ్రామాలకు చెందిన వీఓ మహిళా సంఘాల నుంచి సభ్యులను ఎంపిక చేసి వారితో పాటు పాఠశాల హెచ్ఎంతో జాయింట్ బ్యాంక్ ఖాతాను తీసినట్లు తెలియజేశారు.

మరోసారి గెలిపించాలి



నవాబుపేట గురుకుంట సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవాబుపేట: మన్నె మనవాడే, అందుకే మనం అంత ఏకం కావాలి. మన మధ్యన ఎల్లప్పుడు ఉండే మన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని రెండోసారి ఎంపీగా గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎంపీ నివాసంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి పదవులు లేకున్నా.. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో ప్రజలకు అండగా ఉన్నారని అన్నారు.

నేడు బీఆర్ఎస్ సమరభేరి సభ

మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికలకు సంబంధించి సమర భేరి సభను మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించే సభలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో పాటు ఇతర జిల్లా నాయకులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మయ్య, అనంతయ్య, ప్రతాప్, రాంప్రసాద్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్థానిక రామకోటి స్థూపాలయంలో ఈ నెల 17న నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని పట్టణ ఆర్య వైశ్య మహిళా మండలి సభ్యులు ఆహ్వానించా రు. ఈ మేరకు శనివారం ఆయన్ను క్యాంపు కార్యాల యంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమా ర్‌గౌడ్, సంబు బాలమణి, జూలూరు రేణుక పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలి



చిన్నచింతకుంట మాట్లాడుతున్న వంశీ చంద్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన చిన్నచింతకుంట, కొత్తకోట, దేవరకద్ర మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీకి కార్యకర్తలే అండ అని కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డిపై డీకే అరుణ అనుచిత వ్యాఖ్యలు చేస్తుందని మండిపడ్డాడు. రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాడన్నాడు. రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కొనసాగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ప్రజలు ఆలోచించి మంచి మనసున్న వ్యక్తి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

బీజేపీలో చేరనున్న కృష్ణముదిరాజ్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఉద్యమకారుడు, పండుగ సాయన్న సామాజిక సేవ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ బీజేపీలో చేరనున్నారు. ఆదివారం స్థానిక కొత్తగంజ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరనున్నట్లు తెలియజేశారు. 2001లో స్థాపించిన టీఆర్ఎస్‌లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీలో పని చేశారు. పట్టణ కమిటీ బలోపేతం కోసం కృషి చేశారు. దీంతో పాటు పలు సామాజిక, ప్రజా ఉద్యమాల్లో సైతం పనిచేశారు. తెలంగాణ ఉద్యమ కారులకు బీఆర్ఎస్‌లో సరైన గుర్తింపు ఇవ్వడంలేదని గత కౌన్సిలర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీసీవై పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. బీజేపీలో చేరి పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తానని చెప్పారు.

బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్

జడ్చర్ల టౌన్: బీసీల ఆశాజ్యోతి, బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ స్ఫూర్తిగా బీసీలు ముందుకు సాగాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం బీపి మండల్ వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలోని పూలె చౌరస్తాలో చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీసీ కమిషన్ 2వ చైర్మన్‌గా ఆయన చేసిన కృషితోనే స్థానిక సంస్థల్లో బీసీలు రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. ఆయన స్ఫూర్తిగా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధించేందుకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు దగ్గుల బాల్‌రాజ్, ఆయా సంఘాల నాయకులు వడ్లని శేఖర్‌యాదవ్, నిరంజన్, సురభి విజయ్, బాలు, నాగసాయిలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం : కేసు నమోదు

రాజాపూర్: అక్రమంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం మండల కేంద్రంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. గ్రామానికి చెందిన ఓ కిరాణ దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా.. తనిఖీలు చేసి బీరు, విస్కీ బాటిల్స్ రూ.4,700 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయించిన నిర్మలమ్మపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలియజేశారు.

అధికారుల్లో చలనం

సాక్షి ఎఫెక్ట్..

రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో శనివారం దవాఖానాలో సమస్యల తిష్ట అని 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారుల్లో చలనం వచ్చింది. జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ఆస్పత్రిలోని సమస్యలపై సిబ్బంది నిర్లక్ష్యంపై ఆరా తీశారు. జాతీయ రహదారిపై ఉన్న ఆస్పత్రిలో విధులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అంటూ మండల వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా డెలివరీలపై ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గర్భిణులకు చేయాల్సిన రక్తపరీక్షలు ఎందుకు చేయడం లేదని ఈ విషయాలను ఇంతవరకు ఎందుకు చెప్పలేదని డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

కరాటే బెల్టుల ప్రదానం



బెల్టుల ప్రదాన కార్యక్రమంలో విద్యార్థులతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: మండల కేంద్రంలో షోటోఖాన్ కరాటే ఇండియా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కరాటే బెల్టుల ప్రదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరధ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన సిద్ధార్థ పాఠశాల విద్యార్థులకు బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో నవాబుపేట ఎస్ఐ అభిషేక్‌రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, రూపావతి, మాస్టర్ లక్ష్మన్‌నాయక్, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో జాప్యం వద్దు



మాట్లాడుతున్న బాబురావ్

బాలానగర్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేసి, పాఠశాలలు పునః ప్రారంభమయ్యే లోపు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని మండల ప్రత్యేక అధికారి బాబురావ్ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ మీటింగ్ హాల్‌లో మండల పరిధిలోని ఆయా గ్రామాల హెచ్ఎంలతో, ప్రత్యేక అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్స్ నిర్మాణం, నీటి సదుపాయం, డ్రింకింగ్ వాటర్ సదుపాయాలు, విద్యుత్ సదుపాయం, అవసరమైన తరగతి గదుల్లో ఫ్లోరింగ్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎంపీడీఓ శరత్‌కుమార్, శంకర్, నాగరాజు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐ ఆదిరెడ్డి, తదితరులు

జడ్చర్ల: అగ్నిప్రమాదాలు, వాటి నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఫైర్‌స్టేషన్‌లో వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను, వాల్‌పోస్టర్లను ఆయన ఈ సందర్భంగా విడుదల చేశారు. అగ్నిమాపక వారోత్సవాలు వారం రోజుల పాటు కొనసాగుతాయని, అగ్నిప్రమాదాల సమయంలో అనుసరించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో ఎలా స్పందించి వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రజలు వారోత్సవాల సమయంలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లను అతికించి, కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో వెంటనే 101 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అశోక్‌కుమార్, ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్ నాయక్, రవికుమార్, ఖాజా పాష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం



హారతి ఇస్తున్న అర్చకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం గణేష్‌నగర్‌లోని షిర్డీ సాయి దేవాలయంలో 16వ వార్షికోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్వామివారి అభిషేకం, గణపతి పూజ నిర్వహించారు. వార్షికోత్సవ పూజల్లో ఆలయ ధర్మకర్త పద్మజా గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆదివారం సుప్రభాత సేవ, కాగడ హారతి, విఘ్నేశ్వర పూజ నవగ్రహ హోమాలు నిర్వహించనున్నారు.

ఉమ్రా యాత్రికులకు ఘన సన్మానం



యాత్రికులను సన్మానించిన జహంగీర్ బాబా

స్టేషన్ మహబూబ్‌నగర్: మక్కా, మదీనా ఉమ్రా యాత్రకు వెళ్తున్న మహ్మద్ రఫీ, మహ్మద్ జహంగీర్‌లను శనివారం అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ జహంగీర్‌బాబా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మౌలానా మహ్మద్ముబారక్ యాత్రికులు క్షేమంగా వెళ్లి రావాలని, వారి ఉమ్రా యాత్ర ఖుబూల్ కావాలని, దేశం, రాష్ట్ర అభివృద్ధి కోసం దువా చేశారు. అంతకు ముందు ఈద్‌మిలాప్ నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా, అబ్దుల్ ఖాదర్ జిలాని, ఖాజా అలీబేగ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉడిత్యాలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం



ఉడిత్యాలలో పార్లమెంట్ ఎనికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

బాలానగర్: మండల పరిధిలోని ఉడిత్యాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచందర్ రెడ్డిని గెలిపిస్తే కలిగే ప్రయోజనాలు వివరించారు. ఆయన వెంట ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ గౌడ్, రవి, నర్సింలు ఉన్నారు.

నవాబుపేట: ఎంపీగా గెలిపిస్తే జోడు గుర్రాల అభివృద్ధిలో దూసుకుపోతామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. శనివారం మండల అధ్యక్షుడు రాంచ్రందయ్య అధ్యక్షతన నిర్వహించన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో 50 వేల మెజార్టీ ఇస్తానని మాట ఇచ్చారని, దాని ప్రకారం కార్యకర్తలు నాయకులు కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో యన్మన్‌గండ్ల, తిమ్మయ్యపల్లి, కూచూర్, దొడ్డిపల్లి, దేపల్లితో పాటు వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

డీకే అరుణ నామినేషన్‌కు అధికంగా తరలిరావాలి

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికకు సంబంధించి ఈ నెల 18న బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి డీకే అరుణ నామినేషన్ వేయనున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ తెలిపారు. శనివారం జడ్చర్ల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమానికి పార్లమెంట్ పరిధిలోని గ్రామాలు, పట్టణాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బీజేపీలో చేరిన వారిపై చేస్తున్న వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరుతున్న వారు రౌడీలు, భూకబ్జాదారులని ఆరోపించటం తగదన్నారు. నర్సింహులు, గౌరిశంకర్, మురళి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి

దేవరకద్ర: దేవరకద్ర మండల కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గోపన్‌పల్లికి చెందిన శ్రీకాంత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శనివారం శ్రీకాంత్‌రెడ్డికి నియామక పత్రం అందజేశారు. నాగిరెడ్డి, అరవింద్‌రెడ్డి, అంజల్‌రెడ్డి పాల్గొన్నారు.